సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 2 । మే । 2025



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



బడి బస్సుకు పరీక్షలు

పాఠశాలల బస్సులకు రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కండీషన్ సరిగా లేకపోతే అనుమతులు నిరాకరిస్తున్నారు

8లో

గరిష్టం/కనిష్టం

39.7°/22.3°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కరెంటు బిల్లు కట్టడం ఇక ఈజీ

- బిల్లులోనే క్యూఆర్ కోడ్
- స్కాన్ చేసి పేమెంట్ చేసే అవకాశం
- ఉమ్మడి 'అనంత'లో ఈ నెల నుంచి ప్రయోగాత్మకంగా అమలు



విద్యుత్ బిల్లులోనే వచ్చిన క్యూఆర్ కోడ్

అనంతపురం టౌన్: విద్యుత్ బిల్లులు చెల్లింపుల్లో వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఏపీ ఎస్పీడీసీఎల్ చర్యలు తీసుకుంది. గతంలో ఫోన్‌పే, గూగుల్‌పే తదితర యాప్‌లతో విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. అయితే కొత్తగా విద్యుత్ బిల్లులు మొత్తం నేరుగా డిస్కంలకు వెళ్లే విధంగా బిల్‌డెస్క్ విధానాన్ని సంస్థ ప్రవేశపెట్టింది. ఈ విధానంలో విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించలేక గంటల తరబడి క్యూలో వేచి ఉండి బిల్లులు చెల్లిస్తున్నారు. దీంతో ఎస్పీడీసీఎల్ సంస్థ మే నెలలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. విద్యుత్ బిల్లులోనే చెల్లించాల్సిన మొత్తానికి క్యూఆర్ కోడ్‌ను జత చేసింది. దీంతో వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యుత్ బిల్లులను డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించవచ్చు. ఈనెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్యూఆర్ కోడ్ విద్యుత్ బిల్లులను ప్రయోగాత్మకంగా వినియోగదారులకు అందిస్తున్నారు.

గిరిజన బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల: స్థానిక గిరిజన బాలికల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు. మూడో తరగతిలో 40 సీట్లు, నాల్గో తరగతిలో 32, 5వ తరగతిలో 31, 6వ తరగతిలో 21, 7వ తరగతిలో 1, 8వ తరగతిలో 2, 9వ తరగతిలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన గిరిజన బాలికలు ఈనెల 2వ తేదీ నుంచి 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 8897820565 నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

చౌళూరు మధుమతిరెడ్డికి కీలక పదవి

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం



చౌళూరు మధుమతిరెడ్డి

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డికి కీలక పదవి దక్కింది. ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి పార్టీలో సముచితస్థానం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కృపాసత్యరాజు, పీడీ వినోద్

పరిగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని హర్షవల్లి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలో ఏప్రిల్ 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హర్షవల్లితో పాటూ, 7, 8, 9వ తరగతి చదువుతున్న గంగమ్మ, వర్షిత, ప్రవల్లిక, భవ్య, రమ్య, సౌమ్య ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన హర్షవల్లి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం మైసూరులోని శ్రీరంగపట్నంలో జరగనున్న 39వ సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున హర్షవల్లి ప్రాతినిధ్యం వహిస్తుందని వెల్లడించారు.

జిల్లాలో గుడుంబా గుప్పుమంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెపల్లెనా నాటుసారా లభిస్తోంది. మద్యం ధరలకు రెక్కలు రావడంతో జనం కూడా తక్కువ ధరకు దొరికే సారాను తాగుతున్నారు. దీంతో సారా తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సారాను కట్టడి చేయాల్సిన అధికారులు బెల్లంఊటల ధ్వంసంతో హడావుడి చేస్తున్నారు. సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు.



పల్లెపల్లెనా.. గుడుంబా గుప్పు!

పునరావాస చర్యలు శూన్యం

జిలాల్లో జోరుగా నాటుసారా తయారీ

- బుక్కపట్నం, నల్లమాడ మండలాల్లో విచ్చలవిడిగా బట్టీలు
- రాత్రి వేళల్లో జిల్లా వ్యాప్తంగా సరఫరా
- తక్కువ ధరకు వస్తుందని తాగి అనారోగ్యం పాలవుతున్న జనం
- 'నవోదయం' పేరుతో అధికారుల హడావుడి
- నెలకోసారి సారాకుండలు పగలగొట్టి ఫొటోలకు ఫోజులు
- నిందితులను అరెస్టు చేయకపోవడంతో ఆగని సారా తయారీ



సాక్షి, పుట్టపర్తి

నాటుసారా తయారీ, విక్రయాలు జిల్లాలో ఊపందుకున్నాయి. పుట్టపర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుక్కపట్నం, నల్లమాడ మండలాల పరిధిలో పలు చోట్ల నాటుసారా తయారీ కేంద్రాలు వెలిశాయి. ఎక్సైజ్ అధికారులు అడపాదడపా.. దాడులు చేసి సారా కుండలు పగులగొట్టి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో యథావిధిగా నాటుసారా కేంద్రాలు నడుస్తూనే ఉన్నాయి. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెళ్లిన ప్రతిసారీ బెల్లం ఊటను ధ్వంసం చేయడం, నాటుసారా కుండలను పగులగొడుతున్నారు. కానీ ఎవరినీ అరెస్టు చూపడం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే తాము వెళ్లేసరికే సారా తయారీదారులు పారిపోయారంటూ కథలు చెబుతున్నారు. అందువల్లే అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసినా సారా తయారీ, విక్రయాలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు.

అనారోగ్యానికి గురవుతున్న జనం

నాటుసారాను ప్రమాదకరమైన పదార్థాలతో తయారు చేస్తున్నారు. ముఖ్యంగా మెథనాల్ అనే విషపూరితమైన రసాయనం ఉండటం వల్ల సారా తాగేవారి కళ్లు, కిడ్నీలు దెబ్బతింటాయి. చివరికి ప్రాణపాయం కూడా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయినా తక్కువ ధరకే లభిస్తుండటంతో నిరుపేదలు సారా తాగుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

ఉత్తుత్తి ఫోజులేనా?

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్ని కేసులు నమోదు చేశారు.. ఎంతమందిని అదుపులోకి తీసుకున్నారు.. ఎవరిపై ఎక్కువ కేసులు ఉన్నాయి.. తదితర వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఎన్నిసార్లు అడిగినా ఎవరికీ సమాచారం ఇవ్వడం లేదు. ఏదో ప్రాంతంలో దాడుల్లో ఉన్నామంటూ మాట దాటవేస్తున్నారు. బుక్కపట్నం మండలం మదిరేబైలు, నార్సింపల్లి తండాల్లో ఇప్పటికే పలుమార్లు దాడులు చేసి నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. అయితే అక్కడ ఎవరు సారా తయారూ చేస్తున్నారన్న దానిపై స్పష్టత లేకపోవడంతో సమస్య తలెత్తుతోంది.

అధికారులపై దాడికి యత్నించిన మహిళలు

రెండు వారాల క్రితం నార్సింపల్లితండా సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. తర్వాత గ్రామంలోకి వచ్చి విచారించగా...అందరూ ఓ వ్యక్తి పేరు చెప్పారు. దీంతో అధికారులు సదరు వ్యక్తిని వాహనంలో తీసుకొచ్చేయత్నం చేశారు. అయితే గ్రామస్తులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులపై తిరగబడ్డారు. ఎలాంటి ఆధారం లేకుండా అతన్ని ఎలా అరెస్టు చేస్తారంటూ గొడవకు దిగారు. ఈ క్రమంలో జిల్లా అధికారికి.. ఓ మహిళకు మధ్య వాగ్వాదం జరిగి అధికారి సదరు మహిళపై చేయిచేసుకునేంత వరకూ వెళ్లింది. అయితే ఆ తర్వాత సదరు మహిళకు అధికారులు సర్దిచెప్పడంతో సమస్య బయటికి పొక్కలేదు.

నల్లమాడ, బుక్కపట్నంలోనే అధికం

నాటుసారా తయారీ కేంద్రాలు జిల్లాలోని బుక్కపట్నం, నల్లమాడ మండలాల్లో తప్ప ఎక్కడా కనిపించడం లేదు. ఇక్కడి నుంచే నాటుసారా పలు ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు సమాచారం. అక్కడి ప్రజలు రాత్రి వేళల్లో బట్టీల దగ్గర నాటుసారా కాచి.. బిందెలు, నీళ్ల బాటిళ్ల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. లీటరు సారాను రూ.150 ప్రకారం విక్రయాలు చేస్తున్నారు. సారా తయారీకి రూ.1,000 ఖర్చు చేస్తే.. రూ.2,500 ఆదాయం వస్తోందని తెలుస్తోంది. దీంతో చాలామంది కూలి పనులు మాని.. నాటుసారా తయారీ బాట పట్టారు.

ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నాం

నాటుసారా తయారీ నేరం. సారా తయారు చేసినా.. విక్రయించినా పట్టుకుని కేసులు నమోదు చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తే లేదు. కొన్ని రోజులుగా మెరుపు దాడులు చేస్తున్నాం. ఎక్కడికక్కడ సారా ఊటను ధ్వంసం చేస్తున్నాం. అయితే మేము దాడులు చేసే సమయంలో అక్కడ ఎవరూ ఉండకపోవడం వల్ల సారా ఎవరు తయారు చేస్తున్నారన్న దానిపై స్పష్టత ఉండటం లేదు.

– గోవింద నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి

జిల్లాలో ఎక్కువగా తండాల్లోనే నాటుసారా తయారీ జరుగుతోంది. వాస్తవానికి నాటుసారా తయారీదారులను గుర్తించి వారికి పునరావాసం కల్పించాల్సిన అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. రాయితీతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం లేదు. దీంతో సారా తయారీ, విక్రయాలకు అడ్డుకట్టపడటం లేదు. 'నవోదయం' అంటూ అధికారులు హడావుడి చేస్తున్నారే గానీ సమస్య మూలాలను మాత్రం కనిపెట్టడం లేదని జనం అనుకుంటున్నారు.



ఏప్రిల్ 12వ తేదీన నార్సింపల్లి తండాలో నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు



ఏప్రిల్ 22న బుక్కపట్నం మండలం మాదిరేబైలు సమీపంలో నాటుసారాను పారబోస్తున్న దృశ్యం

కూటమి నిర్లక్ష్యం వల్లే సింహాచలం దుర్ఘటన

- బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం ప్రకటించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: సింహాచలం లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందడం బాధాకరం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దుద్దేబండ గ్రామంలో 'కాఫీ విత్ వైఎస్సార్ సీపీ' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. అక్షయ తృతీయ రోజున లక్షలాది మంది భక్తులు స్వామి వారి నిజరూప దర్శనం కోసం వస్తారన్నారు. ముందస్తు ప్రణాళికలు, భద్రత చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. నాసిరకంగా గోడ నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ దుర్ఘటన జరిగిందన్నారు. ఇందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఘటనా స్థలాన్ని పరిశీలించకపోవడం శోచనీయమని తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, ఉద్యోగం ఇస్తామని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో విశాఖలో జరిగిన ఓ ఘటనలో మృతులకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.కోటి పరిహారం అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి రోజున ఆరుగురి మృతి, శ్రీకాకుళంలో తాబేళ్ల మృతి, తిరుపతిలో గోవుల మృతి ఘటనలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు.. హిందూ దేవాలయాల్లో జరుగుతున్న దుర్ఘటనలపై మాట్లాడక పోవడం ఆశ్చర్యకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్ రెడ్డి, సర్పంచ్ గౌతమి, మాజీ మండల కన్వీనర్లు శ్రీకాంత్ రెడ్డి, బాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, సోమందేపల్లి జెడ్పీటీసీ అశోక్, మండల కన్వీనర్ గజేంద్ర, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, కొండలరాయుడు, చెన్నకేశవులు, పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

పరిగి: క్షయ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలని హిందూపురం జిల్లా ఆస్పత్రి టీబీ వైద్యాధికారి గౌస్‌పీరా, సీహెచ్‌ఓ వన్నప్ప సూచించారు. గురువారం మండలంలోని కాలువపల్లిలో యాక్టివ్ కేస్ ఫైండింగ్ యాక్టివిటీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి క్షయ వ్యాధి నిర్ధారణకు వైద్య పరీక్షలు చేశారు. 18 మందికి టీబీ లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు గౌస్ పీరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడటం, ఛాతీలో నొప్పిగా ఉండటం క్షయ వ్యాధి లక్షణాలు అన్నారు. వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే అలాంటి వారికి తగిన మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పౌష్టికాహారం నిమిత్తం వ్యాధిగ్రస్తుడి వ్యక్తిగత ఖాతాలోకి ప్రతి నెలా రూ.1,000 జమ చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది గిరిజమ్మ, ఏఎన్‌ఎంలు అంబిక, ప్రమీలమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హక్కులు కాలరాస్తే ఉద్యమమే



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్, జేవీవీ, కార్మిక సంఘాల నాయకులు



నల్లమాడలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



హిందూపురం: తూమకుంట పారిశ్రామిక వాడలో ర్యాలీ

కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కార్మిక చట్టాల పరిరక్షణ, హక్కుల సాధనకు మే డే స్ఫూర్తితో సమైక్యంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వాడవాడాలా కార్మిక జెండాలను ఆవిష్కరించారు. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను చేస్తోందని కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్:

ఐఐటీ విద్యార్థికి ఆర్థిక కష్టం

తండ్రి తాగుడుకు బానిసై కుటుంబాన్ని వదిలేసి ఎటోవెళ్లిపోయాడు. తల్లిరెక్కల కష్టంతో చదువుతున్న యువకుడు ఢిల్లీ ఐఐటీలో గత ఏడాది సీటు సాధించాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు చదువుకు ఆటంకం కల్గిస్తున్నాయి. కనీసం ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేక ఆందోళన చెందుతున్నాడు. దాతలు స్పందిస్తే బాగా చదువుకుని సమాజానికి తనవంతు సాయం చేస్తానంటున్నాడు.

- ఢిల్లీ ఐఐటీలో సీటు సాధించిన మేఘనాథరెడ్డి
- గత ఏడాది ఫీజు రూ.7 లక్షలు అందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- ఇప్పుడు రెండో సంవత్సరం ఫీజు కోసం అష్ట కష్టాలు
- దాతలు స్పందిస్తే చదువుకునే అవకాశం



అమ్మ జయలక్ష్మి.. తమ్ముడు జయకిషోర్‌తో మేఘనాథ్‌రెడ్డి (మధ్యలో)

దాతలు సంప్రదించాల్సిన వివరాలు

బాలుడి తల్లి పేరు: వి.జయలక్ష్మి
బ్యాంకు అకౌంట్ నంబర్: 110118882266
బ్యాంకు పేరు: కెనరా బ్యాంకు, కదిరి
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: సీఎన్‌ఆర్‌బీ0006118
ఫోన్ పే నంబర్: 95420 02810

కదిరి: పట్టణంలోని మారుతి నగర్‌లో కాపురం ఉంటున్న వి.జయలక్ష్మి అమడగూరులో ఎఫ్‌ఎన్‌ఓ (ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ)గా ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తోంది. ఆమె భర్త రాజేష్ బాబురెడ్డి మద్యానికి బానిసై ఎటో వెళ్లిపోయాడు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానంలో చూడాలనేది జయలక్ష్మి ఆశయం. తల్లి ఆశయాలకు తగ్గట్టుగానే పెద్ద కొడుకు మేఘనాథ్‌రెడ్డి గత ఏడాది ఢిల్లీ ఐఐటీలో సీటు సాధించాడు. ప్రస్తుతం సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. చిన్న బ్బాయి జయకిషోర్‌రెడ్డి సైతం కదిరి మున్సిపల్ హైస్కూల్‌లో చదివి 10వ తరగతి ఫలితాల్లో 485 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. గత ఏడాది మేఘనాథరెడ్డి ఢిల్లీ ఐఐటీలో సీటు సాధించగా తల్లి జయలక్ష్మి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అయితే ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తన కుమారుడి ఐఐటీ చదువు కలగానే మిగిలిపోతుందని వేదన చెందింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గొప్ప మనసు

మేఘనాథరెడ్డి ఢిల్లీ ఐఐటీలో చదవాలంటే ఏడాదికి రూ.7 లక్షలు దాకా ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి. అంత డబ్బు ఎక్కడి నుండి తీసుకురావాలో తెలియక జయలక్ష్మి కుమిలిపోయింది. వీరి పరిస్థితి ఇరుగుపొరుగు ద్వారా 'రెడ్డి వెల్ఫేర్ సొసైటీ' సభ్యుల దృష్టికి వెళ్లింది. వారి ద్వారా ఈ కుర్రాడి ఆర్థిక ఇబ్బందులు విన్న తలుపుల మండలం ఉబ్బర వాండ్లపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎం.సుధాకర్‌రెడ్డి మొదటి సంవత్సరం ఫీజు మొత్తం ఒకేసారి రూ.7 లక్షలు ఆ కుటుంబానికి అందజేశాడు. దీంతో గత ఏడాది మేఘనాథరెడ్డి చదువుకు ఎలాంటి ఆటంకం కలగలేదు. ఇప్పుడు మళ్లీ దాతల సాయం కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

చదువుల్లో ముందంజ

మేఘనాథరెడ్డి చిన్నప్పటి నుండే చదువుల్లో ముందంజలో ఉండేవాడు. 10వ తరగతిలో 98 శాతం, ఇంటర్‌లో 96 శాతం మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో 15 వేలు, అడ్వాన్స్‌లో 18 వేల ర్యాంకు సాధించి ఢిల్లీ ఐఐటీలో ప్రవేశం పొందాడు. ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతున్న మేఘనాథ్‌రెడ్డి విదేశాలకు డబ్బు పంపితే చెల్లించాల్సిన కమిషన్ శాతం తగ్గించడంపై పరిశోధన చేస్తున్నాడు. తప్పకుండా తన పరిశోధన ఫలిస్తుందంటున్నాడు.

నా ప్రతిభ ఉపయోగ పడాలి



నా ప్రతిభ నాకు, నా కుటుంబానికి మాత్రమే కాదు... నా ఊరు..నా రాష్ట్రం..నా దేశానికి ఉపయోగ పడాలి. ఎంతోమంది భారతీయులు విదేశాల్లో చదువుతున్న తమ పిల్లలకు డబ్బు పంపాలంటే రూ.లక్షకు 30 శాతం వరకూ కమిషన్ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. వారిపై ఈ భారం తగ్గించాలనేది నా కోరిక. దీనిమీదే పరిశోధనలు చేస్తున్నా. కేవలం 4, 5 శాతం ఖర్చుతోనే విదేశాల్లో ఉన్న మనవాళ్లకు డబ్బు పంపే విధానంపై దృష్టి సారించా. నా ఐఐటీ పూర్తయ్యేలోపే కచ్చితంగా నా కల నెరవేరుతుంది. ఆ దేవుడు కూడా నాకు దాతల రూపంలో సాయం అందేలా చేస్తున్నారు.

– మేఘనాథ్‌రెడ్డి, ఐఐటీ విద్యార్థి

క్లుప్తంగా

వృద్ధుడి దుర్మరణం



మృతుడు పోతన్న

పుట్టపర్తి: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం గ్రామానికి చెందిన శ్రీరామరెడ్డి గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై పుట్టపర్తికి వెళుతూ జానకంపల్లికి చేరుకోగానే నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన చెట్టు కింద కూర్చొని మాట్లాడుకుంటున్న పోతన్న (84), పెద్దన్నను ఢీకిన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన పోతన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కాలు విరిగి బాధపడుతున్న పెద్దన్నను స్థానికులు పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. పోతన్న కుమారుడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

కనగానపల్లి: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన నరసింహులు (62)కు మతిస్థిమితం సరిగా లేదు. దీంతో తరచూ రోడ్లపై తిరుగుతుండేవాడు. గురువారం పర్వతదేవరపల్లి వద్ద రహదారిపై వెళుతున్న ఆయనను బెంగుళూరు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనం ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక నరసింహులు మృతి చెందాడు. కాగా, నరసింహులకు భార్య నాగలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కనగానపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బడి బస్సుకు పరీక్షలు

- జిల్లాలో మొదలైన ప్రైవేట్ స్కూల్ బస్సుల సామర్థ్య పరీక్షలు

హిందూపురం అర్బన్: అసలే కాలం చెల్లిన బస్సులు.. డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్లు.. రాష్ డ్రైవింగ్.., బస్సులకు అరిగిన టైర్లు.. సక్రమంగా పని చేయని క్లచ్‌లు.. తరచూ ఫెయిలయ్యే బ్రేకులు ఇదీ చాలా వరకూ ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల పరిస్థితి. ఏటా బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు జూన్ 15 కల్లా పూర్తి కావాలి. జిల్లా వ్యాప్తంగా ఫిట్‌నెస్ పరీక్షలు గత నెల 25 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలు తమ బస్సుల ఫిట్‌నెస్‌కు సిద్ధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 509 విద్యా సంస్థలకు చెందిన బస్సులు ఉండగా, ఇప్పటి వరకూ 40కి పైగా బస్సులు రవాణాశాఖ ద్వారా ఫిట్‌నెస్ పొందాయి. ఈ నెల 15వ తేదీ వరకూ పర్మిట్ ఉండడంతో రోజూ 5 నుంచి పది బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు వస్తున్నాయి.

నిబంధనలు ఇలా..

విద్యా సంస్థల బస్సులు నడపాలంటే డ్రైవర్‌కు 50 ఏళ్ల లోపు వయస్సు ఉండాలి. పదేళ్ల అనుభవంతో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా కలిగి ఉండాలి. డ్రైవర్, సహాయకుడు తప్పని సరిగా యూనిఫాం ధరించాలి. వేగంగా.. నిర్లక్ష్యంగా బస్సు నడపరాదు. విద్యార్థులు బస్సు ఎక్కే సమయంలో, దిగే సమయంలో జాగ్రత్త వహిస్తూ.. విద్యార్థుల కదలికలపైనే దృష్టి పెట్టాలి.



హిందూపురంలోని రవాణా కార్యాలయానికి ఫిట్‌నెస్ నిర్ధారణ కోసం తీసుకు వచ్చిన విద్యా సంస్థల బస్సులు

ప్రథమ చికిత్స బాక్స్, బస్సు స్పీడ్ కంట్రోల్ చేసే స్పీడ్ గౌవర్నర్ కలిగి ఉండాలి. బస్సుపై పాఠశాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్ ఉండాలి. అయితే నిబంధనలు పాటించడంలో జిల్లాలోని కొన్ని విద్యా సంస్థలు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు సమాచారం. రవాణాశాఖ అధికారుల నిబంధనలు అతిక్రమించి కండీషన్ లేని బస్సుల్లోనే విద్యార్థులను తరలిస్తున్నారు. అంతేకాక డ్రైవింగ్ అరకొరగా వచ్చిన యువకులను ఏర్పాటు చేసుకుని కాలం నెట్టుకొస్తున్నారు. ఫిట్‌నెస్‌లేని బస్సులను అతి వేగంగా నడపడంతో వల్ల పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలూ ఉన్నాయి.

ఫిట్‌నెస్ జారీ ఇలా..

ఫిట్‌నెస్ పరీక్షకు వచ్చిన బస్సును ముందుకుగా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నడిపి చూస్తారు. ఆ సమయంలోనే బ్రేకులు, క్లచ్, స్టీరింగ్, హ్యాండ్ బ్రేక్ పనితీరు, బ్యాటరీ సామర్థ్యం, ఇంజిన్ కండిషన్‌ను పరిశీలించి, ఏవైనా లోపాలు గుర్తిస్తే వాటిని మరమ్మతు చేసుకోవాలని సూచిస్తారు. అంతేకాక అత్యవసర ద్వారం, కిటికీలు, టైర్లు కండీషన్‌గా లేకున్నా ఫిట్‌నెస్ జారీ చేయకుండా నిలిపివేస్తారు.

ప్రైవేట్‌కు అనుమతులు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ ఫిట్‌నెస్ (సామర్థ్య) పరీక్షలు రవాణా ఇన్‌స్పెక్టర్లు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు జారీ చేసేందుకు బుక్కపట్నంలోని ఓ ప్రైవేట్ సంస్థకు ఇచ్చారు. ప్రస్తుతం వారు అక్కడ సొంతంగా డిజిటల్ ట్రాకింగ్, ఫిట్‌నెస్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో ఈ ఫిట్‌నెస్ కేంద్రం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇది పూర్తయితే ఇకపై జిల్లా వ్యాప్తంగా ఏ వాహనమైనా ఫిట్‌నెస్ పొందాలంటే అక్కడికి క్యూ కట్టాల్సిందే.

కండీషన్‌లో ఉంటేనే అనుమతులు



విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు మొదలు పెట్టాం. వచ్చిన వాహనాల కండీషన్ బట్టి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నాం. జూన్ 15వ తేదీ లోపు అన్ని బస్సులు ఫిట్‌నెస్ పూర్తి చేసుకోవాలి. ప్రస్తుతం హిందూపురం, కదిరి, ధర్మవరం ఇలా ఎక్కడికక్కడ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పరీక్షలు నిర్వహించి అన్ని సక్రమంగా ఉన్న వాటికే అనుమతులు జారీ చేస్తున్నారు. బస్సులు ఫిట్‌నెస్ లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై తిరగనివ్వం.

– కరుణసాగరరెడ్డి,
జిల్లా రవాణాధికారి, హిందూపురం

గాలివాన బీభత్సం



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రంలో గురువారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. కాళసముద్రం గురుకుల పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై పెనుగాలులకు భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని చెట్లను తొలగించారు. అలాగే యర్రదొడ్డి గ్రామంలో నివాసముంటున్న రమణ ఇంటి ముందు వేసిన రేకుల షెడ్డు గాలికి ఎగిరి విద్యుత్ తీగలపై పడింది. దీంతో తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వ్యక్తి బలవన్మరణం

అమరాపురం: మండలంలోని పేలుబండ గ్రామానికి చెందిన నాగభూషణ (40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... క్యాన్సర్ బాధపడుతున్న నాగభూషణ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం ఉదయం తన పొలం పక్కనే చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ గురువారం సజావుగా సాగింది. జిల్లాలో 2,62,213 పింఛన్ లబ్ధిదారులు ఉండగా, ప్రభుత్వం రూ.114.53 కోట్లు మంజూరు చేసింది. సచివాలయ ఉద్యోగులు తొలిరోజు 2,46,251 మందికి రూ.107.19 కోట్లు పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో 94 శాతం పంపిణీ పూర్తయ్యిందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. ఇంకా 15,962 మందికి పింఛన్ మొత్తం పంపిణీ చేయాల్సి ఉంది.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన ఖాదర్ వలి

కదిరి టౌన్: స్థానిక 31 వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అమ్మజాన్ కుమారుడు, వైఎస్సార్‌సీపీ నేత షేక్ ఖాదర్‌వలిపై టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు అహమ్మద్ అలీ, అతని అన్న కుమారులు ముగ్గురు దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అహమ్మద్ అలీ, అతని అన్న కుమారులు గురువారం వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేస్తుండగా వార్డు కౌన్సిలర్ లేకుండా ఎలా పంపిణీ చేస్తున్నారంటూ ఖాదర్‌వలి ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన టీడీపీ నాయకులు దాడికి తెగబడ్డారు. పింఛన్ల విషయంలో తలదూరిస్తే అంతు చూస్తానని బెదిరించారు. క్షతగాత్రుడు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం చేసిన ఫిర్యాదు మేరకు సీఐ వి.నారాయణరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు ఆంజనేయులు

ధర్మవరం అర్బన్: స్థానిక ఇందిరమ్మ కాలనీ నివాసి ఆంజనేయులు (36) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆంజనేయులు, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొంత కాలంగా నారాయణమ్మ భర్తకు దూరంగా పుట్టింట్లోనే ఉండిపోయింది. దీంతో మనస్తాపం చెందిన ఆంజనేయులు గురువారం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని నిర్జన ప్రదేశంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

స్పందించే వరకూ సమ్మె కొనసాగిస్తాం



డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు, ఎంపీహెచ్‌ఓలు

- ఎంఎల్‌హెచ్‌పీలు

పుట్టపర్తి అర్బన్: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె ఆపేది లేదని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/సీహెచ్‌ఓ అసోసియేషన్ నాయకులు తేల్చి చెప్పారు. సమ్మెలో భాగంగా నాల్గో రోజు గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో కళ్లకు చేతులు అడ్డుపెట్టుకొని నిరసన తెలిపారు. ఈ ప్రభుత్వం చేస్తున్న ఘోరాలను చూడలేమంటూ నినదించారు. ఆందోళన కార్యక్రమాలకు మద్దతు తెలిపిన నాయకులు, ఏపీ ఎన్‌జీఓ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం దిగి వచ్చి తమ డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు, ఎంపీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

చీనీ తోటల్లో డ్రోన్ సర్వేతో అధ్యయనం



డ్రోన్ సర్వేపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

గార్లదిన్నె: చీనీ తోటల్లో పురుగులు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతలపై సాంకేతికంగా డ్రోన్ సర్వేతో అధ్యయనం చేసి రైతులకు సలహాలు, సూచనలు అందించవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్‌ఖాన్ అన్నారు. గురువారం గార్లదిన్నె మండబలం ముకుందాపురంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ని రైతులకు చేరువ చేయాలని ఉద్దేశ్యంతో రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ముకుందాపురం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 17 బృందాలు ముకుందాపురంలోని చీనీ తోటలను సందర్శించి జీపీఎస్ ట్రాకింగ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తాయన్నారు. అలాగే కంపెనీ సాంకేతిక సహకారంతో డ్రోన్‌లో ఏర్పాటు చేసిన మల్టీ స్పెషల్ ఐదు కెమెరాల ద్వారా చీడపీడలపై చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. మూడు రోజులుగా డ్రోన్‌ల ద్వారా 500 హెక్టార్ల విస్తీర్ణంలో అధ్యయనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రత్నకుమార్, విస్తరణాధికారి రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకులో చోరీ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో ఓ హౌస్‌సర్జన్‌కు చెందిన రూ.లక్ష విలువైన సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు... ఈ నెల 28న ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో నైట్ షిఫ్ట్‌లో ఉన్న ఓ హౌస్‌సర్జన్(2కే20 బ్యాచ్) రాత్రి 12 గంటల సమయంలో గర్భిణికి అసవరమైన రక్తం కోసం ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకు వెళ్లారు. అక్కడ గర్భిణి బ్లడ్ మ్యాచింగ్ సరి చూసుకుంటున్న సమయంలో తన సెల్‌ఫోన్‌ను టేబుల్‌పై ఉంచారు. అనంతరం బ్లడ్ తీసుకుని హడావుడిగా వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత తన సెల్‌ఫోన్ కోసం ఆమె మళ్లీ బ్లడ్ బ్యాంక్‌కు చేరుకోగా అక్కడున్న అప్రెంటీస్ టెక్నీషియన్ తనకేమీ తెలియదని బుకాయించాడు. రెండు రోజుల పాటు సెల్‌ఫోన్ అందుబాటులో లేకపోవడంతో విలువైన పాఠ్యాంశాలను ఆమె కోల్పోయింది. ఇదే విషయాన్ని బ్లడ్ బ్యాంక్ వైద్యులు, స్టాఫ్ నర్సుల వద్ద హౌస్‌సర్జన్ చెప్పుకుని బాధపడడంతో గురువారం వారు సదరు అప్రెంటీస్ టెక్నీషియన్‌ని గట్టిగా నిలదీయడంతో దాచిపెట్టిన సెల్‌ఫోన్‌ను తీసి ఇచ్చాడు. ఈ అంశం ప్రస్తుతం ఆస్పత్రిలో హాట్‌టాపిక్‌గా మారింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఆస్పత్రి అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

డాడీ.. ఫంక్షన్‌కు వెళ్లొస్తా!

- ఇదే భావి వైద్యుడి చివరి ఫోన్‌కాల్
- నెల్లూరులో బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో దుర్మరణం
- జిల్లాకు చేరిన అభిషేక్‌రాజ్ మృతదేహం... అంత్యక్రియలు పూర్తి
- కుమారుడి మృతిని తట్టుకోలేకపోతున్న తల్లిదండ్రులు



మృతుడు అభిషేక్‌రాజ్ ఇంటివద్ద కుటుంబ సభ్యులు, బంధువులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'డాడీ... ఫ్రెండ్ సిస్టర్ ఫిక్షేషన్ ఫంక్షన్ ఉంది. నేనూ వెళ్లొస్తా'నంటూ కుమారుడు చేసిన కాల్ చివరిదవుతుందని ఆ తల్లిదండ్రులు ఊహించలేదు. ఉదయం ఫోన్ చేసిన కుమారుడు.. మధ్యాహ్నం ప్రమాదంలో మృతి చెందినట్లుగా సమాచారం అందుకున్న వారి రోదనకు అంతులేకుండా పోయింది. తమ ఇంటి ఆశల సౌధం కుప్పకూలిందనే చేదు నిజాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఇది అనంతపురం రూరల్ మండలం పంగల్‌రోడ్డు సమీపంలోని శిల్ప లేపాక్షి నగర్‌కు చెందిన ఉపాధ్యాయులు రవినాయక్, ప్రమీలాబాయి దంపతుల కన్నీటి వ్యథ.

వైద్యుడిగా వస్తాడనుకుంటే..

శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో బయలాజికల్ సైన్స్ టీచరుగా రవినాయక్, అదే జిల్లా ముదిగుబ్బ జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు టీచరుగా ప్రమీలాబాయి పని చేస్తున్నారు. వీరికి కుమార్తె నిహారిక, కుమారుడు అభిషేక్‌రాజ్ ఉన్నారు. నిహారిక ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేసి సివిల్స్‌కు సన్నద్ధం అవుతోంది. అభిషేక్‌రాజు నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వైద్యుడి మారి వస్తాడని, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారని ఎంతో ఆశతో తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. బుధవారం తల్లిదండ్రులకు ఫోన్ చేసిన అభిషేక్ రాజు... తన స్నేహితుడి సోదరి వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి వెళుతున్నట్లు తెలిపాడు. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం స్నేహితులంతా కారులో తిరుగు ప్రయాణమయ్యారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలో దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్‌రాజ్‌తో పాటు మరో నలుగురు మెడికోలు మృతి చెందారు. ఈ విషయం తెలియగానే తల్లిదండ్రులు ఒక్కసారిగా కుదేలయ్యారు.

అంత్యక్రియలు పూర్తి..

గురువారం ఉదయం శిల్పాలేపాక్షి నగర్‌లోని ఇంటికి అంబులెన్స్‌లో అభిషేక్ మృతదేహం తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూడగానే కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చుట్టుపక్కల కుటుంబాల వారు తరలివచ్చారు. అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా... వైద్య విద్యార్థులందరూ స్నేహితుడి ఇంట్లో శుభకార్యంలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం 1.55 గంటలకు మెడికల్ కళాశాలలో తరగతికి వెళ్లాల్సి ఉంది. 25 నిముషాలు మాత్రమే సమయం ఉండడంతో అతివేగంగా వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారన్న విషయం తెలియగానే అందరి హృదయాలు బరువెక్కిపోయాయి.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ప్రారంభం

పుట్టపర్తి టౌన్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడలకు సంబంధించి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను గురువారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్ తెలిపారు. మొత్తం 50 శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నెల రోజుల పాటు సాగే ఈ శిక్షణ శిబిరాల్లో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాశిక్షకులతో ప్రాథమిక స్థాయి నుంచి వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

శిక్షణా శిబిరాలు ఇలా...

క్రీడ	శిబిరం
వాలీబాల్, హాకీ	పోలీస్ పరేడ్ గ్రౌండ్, పుట్టపర్తి
కరాటే	జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కదిరి
హాకీ, బాక్సింగ్, బాల్ బ్యాడ్మింటన్, టీటీ	జెడ్పీహెచ్‌ఎస్, ధర్మవరం
పటిల్	కేవీకే, పెనుకొండ
జూడో	ఖేలో ఇండియా సెంటర్, చిగిచెర్ల
అథ్లెటిక్స్	కేవీకే, హిందూపురం
ఫెన్సింగ్, కరాటే, కబడ్డీ	జూనియర్ కళాశాల, కదిరి
వాలీబాల్, కబడ్డీ	జెడ్పీహెచ్‌ఎస్, అగళి
హ్యాండ్‌బాల్	డిగ్రీ కళాశాల, కదిరి
పటిల్	సత్యసాయి ఆఫీస్ కాంప్లెక్స్, పుట్టపర్తి
ఫుట్‌బాల్, పటిల్, వాలీబాల్	జూనియర్ కళాశాల, మడకశిర
ఫుట్‌బాల్	ఎంజీఎం గ్రౌండ్, హిందూపురం
చెస్	కళాజ్యోతి ఇండోర్ స్టేడియం, ధర్మవరం
వాలీబాల్, బ్యాడ్మింటన్	జెడ్పీహెచ్‌ఎస్, అమడగూరు
క్యారమ్స్, పటిల్, వాలీబాల్	ఆర్డీటీ స్కూల్, మామిళ్లకుంట
ఫుట్‌బాల్, క్రికెట్	జెడ్పీహెచ్‌ఎస్, బండ్లపల్లి
టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, భైరాపురం
క్రికెట్, హ్యాండ్‌బాల్	పోతులప్పస్వామి గ్రౌండ్, కప్పలబండ
బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్	జెడ్పీహెచ్‌ఎస్, మహమ్మదాబాద్
బాస్కెట్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, పెనుకొండ
పటిల్	స్కూల్ గ్రౌండ్, జగరాజుపల్లి
టెన్నికాయిట్	పుట్టపర్తి
బేస్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, నల్లమాడ
వాలీబాల్	జెడ్పీహెచ్‌ఎస్, బీడుపల్లి
కబడ్డీ	ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బుక్కపట్నం
క్రికెట్, వాలీబాల్, పటిల్	ఆర్డీటీ స్కూల్, బత్తలపల్లి
పటిల్, క్రికెట్, హ్యాండ్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, ఉబ్బరవాండ్లపల్లి

'కియా' ఇంజిన్ల చోరీ కేసులో ఒకరికి రిమాండ్?

పెనుకొండ: కియా కంపెనీలో కారు ఇంజిన్ల చోరీకి సంబంధించి తమిళనాడుకు చెందిన డ్రైవర్ రాజేష్‌ను పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే ఆరు కంటైనర్లను సీజ్ చేసి పోలీసులు ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం న్యాయస్థానంలో హాజరు పరిచి ఒకరిని రిమాండ్‌కు పంపినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, రాజేష్ తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన వాడని తెలిసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు అత్యంత గోప్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

డీఎల్ఆర్ కాలనీలో చోరీ

ధర్మవరం అర్బన్: స్థానిక డీఎల్‌ఆర్ కాలనీలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కాలనీలో నివాసముంటున్న పోలా అశోక్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలసి బుధవారం రాత్రి భోజనం ముగించుకుని ఇంటికి తాళం వేసి పైకెళ్లి నిద్రించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు తాళాన్ని బద్ధలుగొట్టి తలుపులు తీసి లోపలకు ప్రవేశించారు. బీరువాను పగులకొట్టి అందులోని 12.50 గ్రాముల బంగారు నగలు, పట్టుచీరలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

ఎక్సైజ్ పోలీసులను అడ్డుకున్న తండా వాసులు

ముదిగుబ్బ: మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండాకు చెందిన వెంకేనాయక్‌ను పాత కేసులో అరెస్ట్ చేయడానికి గురువారం వెళ్లిన ఎక్సైజ్ సీఐ చంద్రమణి, సిబ్బందిని తండా వాసులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ముదిగుబ్బ పోలీసులు అక్కడకు చేరుకుని తండా వాసులకు నచ్చచెప్పి వెంకేనాయక్‌ను తీసుకెళ్లారు. అలాగే గుడ్డంపల్లి తండాలో తిరుపాల్‌నాయక్‌ను పాత కేసు అరెస్ట్ చేయడానికి వెళ్లగా అక్కడ కూడా తండా వాసులు అడ్డుకున్నారు. గ్రామస్తులకు తిరుపాల్‌నాయక్‌ను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.